# కళ్ళులేని న్యాయం

పులిగడ్డ విశ్వనాథరావు

సాయంకాలం ఆరున్నర అవుతోంది. రామయ్యగారి బంగళా చేరుకుని జానకి రోజులా కాల్ బెల్ నొక్కింది. ఎవరూ తలుపుతీసే అలికిడి కాలేదు. వీధి తలుపు తోయగా తెరుచుకుంది. ఎవరూ కనబడలేదు పిల్లల అలజడి కూడా లేదు.

పిల్లల గదిలోకి వెళ్ళింది. లోన ఎవరూ లేరు. డ్రాయింగు రూమ్‌లో లైటు వెలుగుతోంది. డ్రాయింగ రూమ్‌లోకి వెళ్ళాలో, లేదో ఆలోచించింది వెళ్ళకపోతే లాభం లేదు. మరి పిల్లలు ఉన్నదీ, లేనిదీ ఎలా తెలుస్తుంది?



డ్రాయింగ్ రూమ్‌లో దైవాన్ మీద చేరగిలబడి రామయ్యగారు ఏదో పత్రిక చదువుకుంటున్నారు. నలభై ఏళ్ళు వుంటాయి. ఎత్తుగా, హుందాగా వున్నారు.

జానకిని చూసి, "వచ్చావా?" అని పలకరించారు.

"సీనూ, బేబీ ఇంట్లో లేరా?" అని తడబడుతూ అడిగింది జానకి. సీత రామయ్యగారితో అట్టే మాట్లాడి ఎరుగదు. వయస్సులో, ఆర్థిక స్థితిలో, సాంఘిక హోదాలో పెద్దవాడు- కాబట్టి జానకి ఆయనకు దూరంగా ఉండేది. ఆయన పిల్లలు సీత. బేబికి ట్యూషను చెప్పి తన మానాన తాను వెళ్ళిపోయేది. అవసరమయితే ఆయన భార్య భారతిగారితో మాట్లాడేది.

"లేరు సీతా. మా ఆవిడా, పిల్లలూ మా ఆవిడ అమ్మగారి ఇంటికి వెళ్లారు. రేపు వచ్చేస్తారులే. ఎలాగూ వచ్చావు. కాబట్టి కూర్చో."

"లేదండీ. వెళతాను"

"అంత బెంగాపడతావేం? నేనేమైనా నిన్ను మింగేస్తానా? ఎలాగూ వచ్చావు. కాస్త కాఫీ తీసుకుని వెళుదువుగాని."

అంత పెద్దమనిషి అలా అంటే ఎలాగని ఎంత మొహమాటపడుతున్నా కుర్చీలో కూర్చుంది.

ఫ్లాస్కులోంచి రెండు గ్లాసుల్లో కాఫీ పోసి ఒక గ్లాసు ఆమెకు ఇచ్చి తను రెండవ గ్లాసు తీసుకున్నాడు

"మీ అన్నయ్యా, మీ నాన్న ఎలా ఉన్నారు?"

బాగున్నారండీ."

"సరే. మీ నాన్న పాపం జబ్బుపడ్డప్పటి నుంచి ఏమీ సంపాదించలేకపోయాడట.

మీ అన్నయ్య కూడా ఏమీ చెయ్యక. చెడ్డ తిరుగుళ్ళు తిరుగుతాడట. నిజమేనా?"

నిజమన్నట్టు సీత సిగుపడుతూ మౌనం దాల్చింది. కొద్ది క్షణాల తర్వాత. "వాడు ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్నాడండి. ఏదో జట్టిలో కాలు విరిగింది."

"సరే మీ కుటుంబ భారమంతా నీ మీద పడిందన్నమాట. ఎన్ని ట్యూషన్లు చేస్తున్నా వేమిటి?"

"నాలుగు. సర్" అంది సంకోచంగా.

"రెండు వందల వరకు వస్తాయా?"

"వస్తాయండి"

"మీ అమ్మ పోయిందట గా. ఇంకా అన్నదమ్ములు. అక్క చెల్లెళ్ళు ఎంతమంది ఉన్నారు?"

"ఒక తమ్ముడు. ఇద్దరు చెల్లెళ్ళు.చదువు కుంటున్నారు."

"ఈ రెండు వందల రూపాయలూ అందరికీ సరిపోతాయా?" అని జవాబు కోసం ఎదురు చూడకుండా రామయ్యగారు డ్రాయింగ్‌రూమ్ బైటకు వెళ్ళి లోనించి గడియపెట్టి వచ్చారు.

తిరిగివచ్చి జానకి వద్ద నిల్చుని. "చూడు. జానకీ! నీకు సాయం చేయాలని వుంది నాకు. ఐతే.. " అంటూ ఆమె భుజం మీద చేయివేశారు.

జానకి చటుక్కున లేచి నిలబడి "నేను వెళ్ళవస్తాను." అంది.

"చూడు జానకీ! నా అవసరం తీర్చావా నీకు ఏ లోటూ రాకుండా చూస్తాను." అని డ్రాయింగు రూమ్ తలుపు కూడా లోనుంచి వేసి గడియపెట్టారు.

జానకి ఇలా జరుగుతుందని ఆశించలేదు. అంత పెద్ద మనిషి ఇంత నీచానికి దిగు తాడని ఎవరు మాత్రం అనుకోగలరు?

జానకి కాళ్ళా వేళ్ళాపడింది. "నేను అలాంటిదాన్ని కాను. దయచేసి వెళ్ళ నీయండి" అని ప్రాధేయపడింది. కాని ఎలుక ఆర్తనాదాలు చేస్తే పిల్లి చలిస్తుందా?

ఏడ్చింది. ప్రతిఘటించింది. పెనుగు లాడింది కాని లాభం లేకపోయింది. రామయ్యగారి ప్లాన్ నిరాటంకంగా సాగి పోయింది.

వెక్కి వెక్కి ఏడుస్తున్న జానకి చేతిలో నూరు రూపాయలు పెట్టి "తీసుకో. ఇలా నీకు ముట్టజెప్తూ వుంటానులే. ఏదీ ఒకసారి నవ్వు" అన్నారు రామయ్యగారు.

జానకి డబ్బు తీసుకోలేదు. డబ్బు అక్కడే విడిచిపెట్టి విషాదంగా ఇంటికి చేరు కుంది. జానకి నాన్న తల బాదుకున్నాడు. అతడూ ఏడ్చాడు. ఇదంతా చూసి తెలిసీ తెలియని చెల్లెళ్ళు.తమ్ముడుకూడా ఏడ్చారు. వీళ్ళ ఏడ్పులు విని ఇరుగు పొరుగువాళ్ళు వచ్చి కనుక్కుని సంగతి తెలుసుకొని రాత్రికి రాత్రే పోలీసు స్టేషనులో రిపోర్టు రాయించారు. కేసు నమోదు అయింది. జానకి మెడికల్ పరీక్ష కూడా జరిగింది.

రామయ్యగారు పలుకుబడిగల మనిషి. కాని అంత పెద్ద ఊళ్ళో అతడి పలుకుబడి ఒక లెఖ్ఖా? తాటిని తన్నేవాడుంటే వాడి తల తన్నేవాళ్ళు కోకొల్లలు ఆ ఊళ్ళో. జానకి పేటలో కొంతమంది పెద్దమనుషులు జోక్యం చేసుకుని ఆమెకు న్యాయం జరగా లని రాజకీయ వత్తిడి కూడా తీసుకొచ్చారు.

రామయ్యగారు అరెస్టు అయారు. ఆయన మెడికల్ పరీక్ష కూడా జరిగింది. పోలీసులు ఆయన్ని ప్రశ్నించగా ఆయన ఇలా బదులు చెప్పారు. "జానకి తమ్ముడు చికిత్స కోసం మూడువందల రూపాయలు అడి గింది. నేను ఇవ్వనన్నాను. దాంతో నన్ను అపకీర్తిపాలు చేస్తానని బెదిరించి ఈ నాటకం ఆడింది. అసలు నేనేమీ ఎరు గను." అన్నారు. సెషన్సు జడ్జి రామయ్య గార్ని జామీనుపై విడిచిపెట్టారు.

సెషన్స్ జడ్జి కుటుంబరావుగారి కోర్టులో ఆ కేసు నడిచింది. రామయ్యగారు పేరు మోసిన వకీళ్ళను కుదుర్చుకుని కేసును పోరాడారు.


సెషన్స్ జడ్జి ముందు రామయ్యగారు తాను అరెస్టు అయాక పోలీసు స్టేషనులో ఇచ్చిన వాఙ్మూలాన్ని మార్చేశారు. నిజా నికి మెడికల్ పరీక్ష, రిపోర్టులు, అప్పటి జానకి పరిస్థితి. ఆయన మొహంపై గాయాలు ఇతర పరిస్థితి సాక్ష్యాధారాలు ఆయన వాఙ్మూలం అబద్ధమని రుజువుచేస్తు న్నాయి. అందుకని ఆయన ఈ విధంగా వాఙ్మూలాన్ని సవరించారు. అసలు జానకి అంగీకారంతోనే తాను ఆ నీచపు పనికి ఒడి గట్టాడట. తర్వాత ఆమె వెయ్యి రూపా యలు అడిగిందట. తనవద్ద మూడువందలే ఉన్నాయట. దాంతో ఆమె ఈ నాటకం ఆడిందట.

కుటుంబరావుగారు విచారణ జరిపి రామయ్యగారికి సందేహలాభం ఇస్తూ విడిచి పెట్టారు. ఆయన రామయ్యగారికి సందేహ లాభం ఇవ్వడానికి రెండు కారణాలు పేర్కొ న్నారు.

ఒకటి—సంఘటన సాయంకాలం జరిగితే దాన్ని రాత్రి పది పదకొండుకు పోలీసు స్టేషనులో రాయించారు. అంత ఆలస్యం ఎందుకైనట్టు? రెండవది- ఈ సంఘటనకు ఎవరూ సాక్షులు లేరు.

ఈ తీర్పు ఇచ్చే ముందు కుటుంబరావు గారికి తాను జానక్కి అన్యాయం చేయడం లేదు కదా అనే సందేహం రాకపోలేదు. ఆ సందేహం మహారాజులా వచ్చింది. మానభంగమయాక ఒక అమ్మాయి మనసు ఎంత కలవరం చెందుతుంది? ఆ అమ్మాయి తల్లిదండ్రులు కూడా ఎంత క్షోభపడతారు? అటువంటి పరిస్థితిలో ఈ విషయాన్ని గుట్టుగాఉంచాలనికూడావారు కోరుకుంటారు కొద్దికాలానికి దీన్ని గుట్టుగా ఉంచడం శావ్యమూకాదనీ. సాధ్యమూ కాదనీ వారు తెలుసుకుంటారు. గుట్టుగా వుంచితే దౌర్జన్యం జరిపిన నరరూప రాక్షసుడికి ఏ శిక్ష పడదు. ఈ విషయం ఆట్టే కాలం గుట్టుగా కూడా వుండదు. ఈ తర్జనభర్జన వలన ఆలస్యమైతే అవవచ్చు.

రెండవది. ఇటువంటి అత్యాచారం జరిపేముందు ఏ సాక్షులూ లేకుండా నింది తుడు జాగ్రత్తపడతాడు. అందరూ చూస్తూ వింటూ వుండగా ఒక స్త్రీని బలాత్కరించ డానికి రామయ్య పిచ్చివాడా? అయితే జానకి రామయ్యగారిని అవమానించడానికి



ఈ నాటకం ఆడి వుండవచ్చుగా! పెళ్ళి కాని ఒక అమ్మాయి. మంచి కుటుంబానికి చెందిన నది. ఈ విధంగా నాటకం ఆడి తన బ్రతుకుని చెరుపుకుంటుందా ?

రామయ్యగారు నిర్దోషి అనడానికి ఆయన ఇచ్చిన వాఙ్మూలాలు సందేహం కల్పిస్తున్నాయి. పోలీసు స్టేషనులో ఆయన నేరం ఒప్పుకోలేదు. తర్వాత తన కోర్టులో ఆ నేరం జానకి తోడ్పాటుతో చేసినట్టు చెప్పాడు. రామయ్య దోషి అని కుటుంబరావుగారి మనసు అంటోంది. కాని మన న్యాయ వ్యవస్థ అటువంటిది. దానికి సాక్షులు కావాలి. తాను ఏమి చేయగలడు! చట్టానికి కళ్ళు ఉండవుగా. అందువలన సందేహ లాభం ఇచ్చి రామయ్యగారిని విడిచిపెట్టాడు.

రామయ్యగారి సంతోషానికి మితిలేదు.

ఇది జరిగిన కొన్ని నెలలకు కుటుంబరావుగారి కుటుంబంలో అనుకోని ఒకవిషాద సంఘటన జరిగింది. ఆయన కొడుకు భిలాయిలో ఇంజనీయర్‌గా ఉంటున్నాడు. అతనికి పదహారేళ్ళ అమ్మాయి సుజాత ఉంది. చక్కదనంలో సుజాత తనకు తానే సాటి. కుటుంబరావుగారికి, ఆయన భార్యకి సుజాత అంటే ఎంతో ముద్దు. నాలుగేళ్ళ క్రితం వరకు ఆమె వాళ్ళవద్దే ఉండేది.

భిలాయిలో సుజాత చదువుకుంటోంది. అక్కడి దుండగుల కళ్ళు ఆమె చక్కదనంపై పడ్డాయి. వాళ్ళు ఆమెను ఒకరోజు స్కూలు నుంచి వస్తూండగా చూసి ఎత్తుకుపోయి బలవంతం చేశారు. ఆమె ఏడుస్తూ ఇంటికి వచ్చింది. పోలీసు రిపోర్టులు, మెడికల్ పరీక్షలు అన్నీ అయాయి. దుండగులు అరెస్టు అయారు. ఆమెపై జరిగిన అత్యాచారం తెలుసుకుని కుటుంబరావుగారి రక్తం కుతకుత ఉడికిపోయింది.

ఆ రాత్రి కుటుంబరావుగారికి నిద్ర రాలేదు. దుండగులకు తప్పకుండా శిక్ష పడాలని అని ఆయన కోరుకున్నారు. కాని కోర్టు వాళ్ళకి సందేహ లాభం ఇవ్వవచ్చుగా. న్యాయానికి కళ్ళు ఉండవే. ఆయనకు జానకి కేసు గుర్తుకు వచ్చింది. ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ తనముందు కోర్టులో ప్రశ్నలకు ఇచ్చిన జవాబులూ, ఆమె దయనీయమైన మొహం జ్ఞాపకం వచ్చాయి. న్యాయానికి కళ్ళు లేకపోయినా తాను గుడ్డివాడు కాదు కదా! ఆయన బాధతో మూలిగి వత్తిగిల్లాడు. *





OBM/2075 R-TEL